www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 25 సెప్టెంబర్ 2024
5
చిత్తూరు



వెల్ డన్ జాబ్.!

● జాబ్ మేళాలో 88మందికి కొలువులు ● అభినందించిన కలెక్టర్



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న వివిధ కంపెనీల హెచ్ఆర్‌లు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించేందుకు డీఆర్‌డీఏ, సీడాప్ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. మేళాలో వివిధ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 190మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 88మందిని వివిధ కంపెనీలు ఎంపిక చేశారు. ఇందులో డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 7మంది, ముత్తూట్ గ్రూప్‌కు 20మంది, యంగ్ మైండ్స్ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 24మంది, ఏజిఎస్ హెల్త్ సర్వీసెస్‌కు 8మంది, ఖజానా జువెలరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 15మంది, క్రియా టెక్నాలజీస్‌కు 14మంది ఎంపికైయ్యారు.

ఉద్యోగం సాధించే వరకూ ప్రయత్నం ఆపొద్దు: కలెక్టర్

యువత ప్రభుత్వ, బ్యాంకింగ్, ప్రైవేట్ ఉద్యోగాలు లాంటివి సాధించే వరకు నిరంతరం ప్రయత్నిస్తుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన యువతనుద్దేశించి మాట్లాడారు. చిరుద్యోగంలోనైనా నిజాయితీ, పట్టుదల, నైపుణ్యాంతో రాణించాలన్నారు. సరైన ఉద్యోగం పొందేవరకూ ప్రయత్నాలను ఆపొద్దని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఉద్యోగాలు పొందిన యువతీ యువకులను ఆయన అభినందించారు. అనంతరం వివిధ కంపెనీల్లో ఉద్యాగాలకు ఎంపికైన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేడీఎం సరితా రెడ్డి, వివిధ ప్రైవేట్ సంస్థల హెచ్‌ఆర్‌లు, సీడాప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

మానవసేవే మాధవసేవ... ఇదంతా ఒకప్పుడు.. ప్రస్తుతం స్విమ్స్‌లో కార్పొరేట్‌కు 'రెడ్‌కార్పెట్' పరిచారు తప్ప, కార్పొరేట్ స్థాయి వైద్యం డొల్లే.. 'లాభాల్లోనే టిటిడి వేట' .. ఇది సాధారణ జనం చెప్పే మాటలు కాదు.. స్వయానా టిటిడి ఉద్యోగులే అత్యవసర పరిస్థితుల్లో తమిళనాడు రాష్ట్రం సిఎంసికో, అపోలోకో పరుగులు తీస్తున్నారు. దశాబ్దాల పాటు శ్రీవారి సేవ చేస్తున్న టిటిడి ఉద్యోగులను కాపాడుకోవాల్సిన టిటిడి యాజమాన్యం ఆధునిక వైద్యం అందించడంలో మీనమేషాలు లెక్కిస్తూనే ఉంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆదాయం కోట్లల్లో ఉన్నా.. వైద్యుల



కొరత, సిబ్బంది లేకపోవడం, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అందకపోవడం స్విమ్స్‌లో దీర్ఘకాలిక సమస్యలు.. ఎంతసేపు కాంట్రాక్టు, కాంట్రాక్టు, కాంట్రాక్టు.. డయాలసిస్ విభాగాన్ని 'నెఫ్రోప్లస్'కు అప్పగించేశారు. 20 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఏడుగురితో సరిపెడుతున్నారు. 120 మంది టెక్నీషియన్లు ఉండాల్సిన చోట కేవలం 27 మందే ఉన్నారు. ఒక్కసారే వాడాల్సిన డయాలైజర్‌ను పదిసార్లు వాడేస్తున్నారు. వైద్యసేవే ఉన్నతంగా భావించి విధుల్లో ఉన్న సీనియర్లు సైతం ఓ రకంగా నిస్సహాయ స్థితిలో ఉన్నారు. దీంతో స్విమ్స్‌కు పోయి డయాలసిస్ పేషంట్లు 'ఇన్‌ఫెక్షన్లను' కొని తెచ్చుకుంటున్నారు.

'ప్రజాశక్తి' ఎక్స్‌క్లూజివ్ 1

నెఫ్రో ప్లస్ లైఫ్ లెస్

- కిడ్నీ రోగులకు 'డై'లైజర్ ప్రమాదం
- స్విమ్స్‌లో కొని తెచ్చుకుంటున్న 'ఇన్‌ఫెక్షన్లు'
- 20 మందికి గాను 7మంది డాక్టర్లతోనే సరి
- 120 మందికి బదులు 27 మందే టెక్నీషియన్లు
- ఐదేళ్లలో 600 మందికి పైగా మృతి



డయాలసిస్ కోసం...

ప్రజాశక్తి- తిరుపతి

'నెఫ్రోప్లస్' నిర్లక్ష్యం... కిడ్నీ రోగుల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయి. శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్)తో 2017లో చేసుకున్న ఎంఒయు ఒప్పందం ఒకటైతే దానికి భిన్నంగా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తోంది. 120 బెడ్లకు గాను కేవలం 80 బెడ్లతోనే సరిపెడుతోంది. ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, నైపుణ్యం కలిగిన సిబ్బందిని, వైద్యుల్ని నియమించుకోకుండా వైద్యసేవలు అందిస్తోంది. ఫలితంగా ఐదేళ్లలో 600 మందికి పైగా రోగులు ఇన్‌ఫెక్షన్లతో మృత్యువాతపడినట్లు ఆంధ్రప్రదేశ్ కిడ్నీ రోగుల సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. తమకు ఇహెచ్‌ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీం) ఉన్నప్పటికీ నాణ్యమైన వైద్యానికి తిలోదకాలిచ్చి తమ ప్రాణాలకు సంకటంగా డయాలసిస్ చేస్తున్నారంటూ ప్రభుత్వ, టిటిడి ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. అటు స్విమ్స్ యాజమాన్యం, ఇటు ప్రభుత్వం స్పందించక పోవడం గమనార్హం.

రాయలసీమలో కిడ్నీ బాధితుల సహాయార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో 2017లో ప్రత్యేక డయాలసిస్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. 100 అధునాతన డయాలసిస్ యంత్రాలను సమకూర్చారు. సమర్థవంతంగా రోగులకు డయాలసిస్‌ను తాము చేస్తామంటూ నెఫ్రోప్లస్ యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో 2017 జనవరిలో స్విమ్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఐఎస్‌ఎన్ (ఇండియన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ) గైడ్‌లైన్స్, మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ నిబంధనల్ని తూచా తప్పకుండా పాటిస్తామని నమ్మించింది. ఈ ప్రకారం 5 మెషిన్లకు ఒక డయాలసిస్ డాక్టర్, ఐదు మంది టెక్నీషియన్లు ఉండాల్సి ఉంది. ఈ లెక్కన 100 మెషిన్లు ఉన్న ఆస్పత్రిలో కనీసం 100 మంది క్వాలిఫైడ్ టెక్నీషియన్లతో పాటు అదనంతో 20 మంది డాక్టర్లను నియమించుకోవాలి. రోగులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మానసిక వైద్యులు, ఆహార నియమాలు చెప్పేందుకు డైటీషియన్లు తప్పకుండా ఉండాలి. ప్రైమ్ టైంలో (డయాలసిస్ చేసుకునేముందు) 2 లీటర్ల సెలైన్‌తో మెషిన్‌ను శుభ్రపరచాలి. సింగిల్ యూజర్ డయాలైజర్‌ను వాడాలి.యాసిడ్, బైకార్బొనేట్ వాడాలి. కానీ స్విమ్స్‌లో ప్రస్తుతం ఏడుగురు డాక్టర్లు, 27 మంది టెక్నీషియన్లు మాత్రమే విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. తాజాగా ఓ సీనియర్ జర్నలిస్ట్ మునికుమార్ డయాలసిస్ ఇబ్బందులతో మృతిచెందారు.

అత్యవసర చికిత్స చేయడం లేదు ? : జయరాం, బాధిత రోగి, తిరుపతి

నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో రోజుకు నాలుగు షిఫ్టుల్లో ఉదయం 6 గంటలకు, 11 గంటలకు, సాయంత్రం 4 గంటలకు, రాత్రి 8 గంటలకు డయాలసిస్ చేస్తున్నారు. అయితే వైద్యులు, టెక్నీషియన్లు 9 గంటలకు వస్తారు. ఇలా ప్రతినెలా 1800 మంది డయాలసిస్ చేసుకుంటున్నారు. అయితే నెఫ్రోప్లస్ యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి, నాన్‌క్వాలిఫైడ్ సిబ్బంది అశ్రద్ధ , ఒకే డయాలైజర్‌ను 10 సార్లు వినియోగించడం వల్ల తరచూ సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయి. రోగులు తీవ్ర అస్వస్థతకు గురవుతూ ప్రాణాపాయస్థితికి వస్తున్నారు. అయితే తమ వద్ద అత్యవసర చికిత్స అందుబాటులో లేదంటూ స్విమ్స్‌కు తరలిస్తున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ రోగి అయినప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో రూ 7 నుంచి 10 వేలు వెచ్చించి వైద్యం తీసుకోవాల్సి వస్తోంది.



బయటే వేచి ఉన్న రోగులు


శాప్ ఛైర్మన్‌గా రవినాయుడు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నామినేట్ పదవుల భర్తీకి శ్రీకారం చుట్టింది. మంగళవారం పలువురికి ఛైర్మన్ పదవులు ఇస్తూ తొలిజాబితాను ప్రకటించింది. తిరుపతి జిల్లాకు చెందిన తెలుగు యువత అధ్యక్షులు రవి నాయుడు కి స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ (శాప్) పదవిని కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే చంద్రగిరి నియోజకవర్గ అసెంబ్లీ పరిశీలకుడు ఊక విజయ్ కుమార్‌ను ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడుగా నియమించారు. అలాగే చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మున్సిపల్ ఛైర్మన్ కొటారి హేమలతను టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ సభ్యురాలుగా నియమించారు. అయితే తిరుపతికి చెందిన టిడిపి నేతలు మాత్రం



రవినాయుడు



పూకా విజయ్‌కుమార్



కటారి హేమలత

పూకా, కటారిలకూ చోటు

పార్టీ అధిష్టానం పై అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లి అక్రమ కేసుల్లో ఇరుక్కున్న వారిని నామినేట్ పదవుల్లో వారి పేర్లు లేకపోవడంతో టిడిపి శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యారు. గత కొన్ని సంవత్సరాలుగా టిడిపి పార్టీ అభ్యున్నతికి కషిచేసిన వారికి నామినేట్ పదవుల్లో మొదటి జాబితాలో వారు పేర్లు లేకపోవడంతో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ వద్దకు వెళ్లి ఆశావాహులు అసంతప్తి వెళ్ళగక్కారు. పార్టీకి కష్టపడిన వారికి పదవులు ఇవ్వకుండా ఇతరులకు ఇవ్వడం పట్ల టిడిపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే తన పరిస్థితి ఏందని ప్రశ్నిస్తున్నారు.

చెత్త వాహనాలను బాగు చేయండి

- రికార్డులు పక్కాగా ఉండాలి
- నగరపాలక సిబ్బందికి కమిషనర్ ఆదేశం



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మరమ్మతులకు గురైన చెత్త సేకరణ వాహనాలను బాగు చేయాలని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ సిబ్బంది ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాహనాల కోసం ఏర్పాటు చేసిన షెడ్డులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్నవి, మరమ్మ తులకు గురైవెన్ని అనే వివరాలను ఆరాదీశారు. పాడైన వాహనాలను బాగు చేయాలని సూచించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదును పరిశీలించారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ నరసింహ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి-కుప్పం రూరల్: మండలంలోని చెక్కునత్తం పంచాయతీ అడవి ములకలపల్లి నుంచి బాబునగర్ వరకు నూతన బస్సు సర్వీస్‌ను ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం ప్రారంభించారు. పూజా కార్యక్రమాన్ని నిర్వహించి, స్వయంగా బస్సును నడిపారు. అనంతరం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, డిపో మేనేజర్ పెంచులయ్య, మాజీ ఎంపీపీ సాంబశివం, డాక్టర్ వెంకటేష్, రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి తదితరులు ఆర్టీసీ ఉపాధ్యక్షులుగా నియమితులైన మునిరత్వంను ఘనంగా సన్మానించారు.



బస్సు నడుపుతున్న మునిరత్నం

కొత్తగా ఉందని ట్రై చేశారంటూరా.!

ట్రై సైకిల్‌పై చెత్త కుప్ప తరలింపు

ప్రజాశక్తి-విజయపురం: నగరి ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఓ ఆసక్తి కరమైన సంఘటన చోటు చేసుకొంది. రోగులను తరలించడానికి వినియోగించే ట్రై సైకిల్‌పై చెత్త కుప్పలను తరలించడం చర్చనీయాంశంగా మారింది. చెత్త కుప్పలను తరలించే ట్రై సైకిల్‌పై మళ్లీ రోగులను ఎలా తరలిస్తారని, అక్కడ ఉన్న రోగులు ముక్కున వేలు వేసుకొన్నారు.



వరద బాధితులకు రూ.5లక్షల విరాళం



చెక్కు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లి రత్న బయోటెక్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డిని మంగళవారం పలమనేరులో ఆయన కార్యాలయంలో రత్న బయోటెక్ ప్రతినిధులు శివకుమార్, శంకర్‌రెడ్డిలు కలిశారు. రూ.5లక్షల విరాళపు చెక్కును ఎమ్మెల్యేకి అందజేశారు. సీఎం సహాయ నిధికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వారిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

శాస్త్రోక్తంగా శాంతి హోమం



శాంతి హోమం చేస్తున్న ఆలయ అర్చకులు

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు ప్రాయశ్చిత్త శాంతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజాది కార్యక్రమాలు గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, కలశపూజ, ప్రాయశ్చిత్త హెూమం, మహా పూర్ణాహుతి, సంప్రోక్షణ, వివిధ పూజలు వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు.

కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్‌లోని వివేకానంద భవన్‌లో వివిధ సెక్షన్లను, సిపిఓ, జిల్లా పౌర సరఫరాల సంస్థ, ఎన్ఐసి, డిఎం సివిల్ సప్లైస్ కార్యాలయాలను పరిశీలించారు. పరిశుభ్రంగా ఉంచు కోవడంపై దృష్టి పెట్టాలని కార్యాలయంలోని సిబ్బంది వారి వారి కేటాయించిన విభాగాలకు సంబంధించిన ఫైల్స్‌ను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. పనిచేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశం ఉంటుందని ప్రతి అధికారి వారి సిబ్బందికి ఆ దిశగా సూచనలు ఇచ్చి అమలు చేయాలన్నారు. కార్యాలయాలలో నిరుపయోగంగా ఉన్న వస్తువులను, పనికిరాని వస్తువులను తొలగించి శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ప్రజా స్పందనను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి వస్తున్న స్పందనను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్‌లు, డీఎల్‌డీవో, ఎంపీడీవోలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని ఎంఈఓల పరిధిలో ప్రతి హైస్కూల్, కళాశాలలో ఈ నెల 27 నుంచి 29వరకు స్వర్ణాంధ్ర-2047పై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతి మండలానికి ముగ్గరిని విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందించాలన్నారు.

ఆశా యూనియన్‌తో డిఎంహెచ్‌వో చర్చలు

- ఆశాలపై పని భారం తగ్గించాలి
- కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి
- చర్చలలో యూనియన్ నాయకులు డిమాండ్



యూనియన్ నాయకులతో చర్చిస్తున్న డీఎంహెచ్‌వో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఆశా కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా సంయుక్త సమావేశం యూనియన్ నాయకులతో డిఎంహెచ్వో, సిబ్బంది మంగళవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, జిల్లా నాయకులు పద్మ, అనురాధ, లీల తదితరులు మాట్లాడుతూ జిల్లాలో అన్ని పీహెచ్‌సీల్లోనూ 9గంటల నుంచి నాలుగు గంటల వరకు ఫీల్డ్ వెల్లకుండా కూర్చోబెట్టి మూడుసార్లు హాజరు వేపించడం సరైంది కాదన్నారు. ఆశా వర్కర్స్‌కి సంబంధంలేని పనులు మందులు వ్యాక్సిన్లు క్యారియర్లు మోపించడం, ఆన్లైన్లో పనులు చేయించడం మానుకోవాలని, ఆసుపత్రులకు కేసులు తీసుకెళుతున్నప్పుడు డ్యూటీలు వేయడం, బెదిరింపులతో డబ్బులు వసూలు చేయడం మానుకోవాలని, సబ్ సెంటర్లో, పీహెచ్‌సీల్లో ఓపి డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్కాస్ టీంలు వచ్చినప్పుడు డ్యూటీలు వేయడం ఆపాలని, ఆశా వర్కర్ల చేత పరిశుభ్రత పేరుతో రకరకాల పనులు చేయించడం ఆపాలని, అన్ని ఆసుపత్రుల్లో రెస్ట్ రూములు కేటాయించాలని, ఆశ వర్కర్స్‌కి ఇవ్వాల్సిన రికార్డులు యూనిఫామ్ స్థానికంగానే ఇవ్వాలని లేనిపక్షంలో జిల్లాకు పిలిస్తే టిఏ, డిఏలు ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా పాత టూజీ సిమ్‌లు ఉండడం వలన ఎలాంటి యాప్స్ పనిచేయకపోవడంతో వర్క్ చేయలేకపోతున్నామని 4జి సిమ్‌లు ఇవ్వాలని, కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలని, ఆశ డే సందర్భంగా నేలపై కూర్చోబెట్టడం మానుకోవాలని, అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు సెలవులు పర్మిషన్లు ఇవ్వాలని, చర్చల్లో వివరించారు. ఈ సమస్యలు చెప్పినందుకు రేపటి నుంచి పీఎస్సీల్లో కక్ష్య సాధింపు చర్యలు చేపడతారని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలన్నీ పరిష్కారం చేస్తా

- డిఎంహెచ్‌వో హామీ

ఆశ వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు వివరించిన సమస్యలపై డిఎంహెచ్ఓ సానుకూలంగా స్పందిస్తూ తమ పరిధిలో ఉన్న సమస్యలన్నీ పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా మందుల బాక్సులు మోయడం ఆన్లైన్లో పనిచేయడం ఇలాంటివేవీ కూడా చేయాల్సిన అవసరం లేదని వీటిపై రాతపూర్వకంగా కింది స్థాయి అధికారులకు పంపుతామని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే రాతపూర్వకంగా ఇవ్వాలని తెలిపారు.

వర్షమొస్తే.. హాస్టల్ నీట మునుగుతోంది మేడం.!

- బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన జేసీ
- అక్కడి పరిస్థితిని వివరించిన అధికారులు




ప్రజాశక్తి-బంగారుపాళ్యం: "వర్షం వస్తే వసతి గృహం నీట మునుగుతోంది మేడం.. విద్యార్థుల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. గత నెల కురిసిన వర్షానికి హాస్టల్లోకి నీరు చేరాయి.. ఇబ్బందులు పడి పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలోకి విద్యార్థులను తీసుకెళ్లాం.." అని బంగారుపాళ్యం బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహం అధికారులు జేసీ విద్యాధరికి వివరించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని భోజనశాల, వంటశాల, నిత్యావసర సరుకులు నిల్వ, మరుగుదొడ్లను, గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి అక్కడి పరిస్థితిని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. వర్షం కురిస్తే నీరు చేరి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. నూతన భవనానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, డీటీ కళ్యాణి, వసతిగృహ అధికారి గీత, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

నీ ప్రేమ చల్లగుండ.. ఇవేం వేషాలయ్యా బాబు.!

- ప్రియురాలి కోసం మారు వేషంలో హాస్టల్లోకి చొరబడ్డ యువకుడు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పిఈఎస్ వైద్యవిద్య కళాశాల మహిళా వసతి గృహంలో ఉన్న ప్రియురాలిని కలిసేందుకు ఆదివారం రాత్రి ఒక యువకుడు మారువేషంలో వసతి గృహంలో చొరబడేందుకు యత్నించాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కేరళ రాష్ట్రం త్రిసూరు జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని పిఈఎస్ కళాశాల వసతిగృహంలో ఉంటూ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బెంగళూరులో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల కిందట వీరిద్దరూ కేరళలో చదువుతూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. బెంగళూరు నుంచి కుప్పం చేరుకున్న యువకుడు తన ప్రియురాలిని కలవాలని, వసతిగృహం సిబ్బందికి అనుమానం రాకుండా బురఖా ధరించి వసతిగృహంలోకి ప్రవేశించే ప్రయత్నం చేశారని, ఈ క్రమంలో సిబ్బంది అప్రమత్తమై అనుమానంతో తనిఖీ చేయగా యువకుడు పట్టుబడ్డట్టు తెలిపారు. వెంటనే నిందితున్ని కళాశాల అధికారుల సూచన మేరకు పోలీసులకు అప్పగించామన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ అరుణ్ కుమార్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.శ్రీనివాసులు తెలిపారు.



హాస్టల్లోకి చొరబడ్డ యువకుడిని అడ్డుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది

వ్యవసాయం లాభసాటి చేసేందుకే..

● ఆధునిక పద్ధతులను రైతులకు పరిచయం చేస్తాం ● ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించేందుకు కృషి ● 'పొలం పిలుస్తోంది'లో పలువురు నేతలు, అధికారులు



చిత్తూరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల



గంగవరం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఐరాల: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను రైతులకు పరిచయం చేసి ఆరోగ్యవంతమైన పంటల దిగుబడి సాధించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలం తాలంబేడు పంచాయతీలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నాయకులు చంద్ర ప్రకాష్, జయచంద్ర నాయుడు, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో భవాని కోరారు. మండలంలోని అక్కన్నగారిపల్లిలో మంగళవారం రైతులతో కలిసి అధికారులు వేరుశనగ పంటను పరిశీలించారు. పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ మురళీమోహన్, ఉద్యానవన అధికారి బాలాజీ, సెరికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ జయచంద్ర, మార్కెటింగ్ యార్డ్ అసిస్టెంట్ రుషేంద్ర బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని కనమన పల్లిలో గుండ్ల సాగరం రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు.

తవణంపల్లి: మండలంలోని తెల్లగుండ్లపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు వందన, సర్పంచ్ మోహన్ నాయుడు, ఎంపీటీసీ రాధాకృష్ణ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతుల ముంగిటకే సేవలందించేందుకు రైతుల కోసం ప్రతిష్టాత్మకమైన 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని ప్రారంభించిందని మండల వ్యవసాయ అధికారి నర్మదా, వెటర్నరీ డాక్టర్ శ్రీవిద్య అన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ, ప్రసాద్, ప్రియాంక, శివ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల వ్యవసాయ అధికారి అధ్యక్షతన బేలుపల్లి కమనపల్లి పంచాయతీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సోమల: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ఏర్పాటు చేసిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ కోరారు. మంగళవారం కందూరు పగడాలవారిపల్లి మిట్టపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు.

సదుం: మండలంలోని కంభంవారిపల్లిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి ప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాలిని కృష్ణ, మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

విజయపురం: యంత్రీకరణ వ్యవసాయం.. రైతులకు లాభాన్ని అందిస్తుందని ఏవో రజినికుమార్ తెలిపారు. మంగళవారం విజయపురం, విజయపురం దళితవాడ, పంచాయతీలో పాలంబండి కార్యక్రమం ప్రారంభించారు.

కార్వేటినగరం: పొలం పిలుస్తుంది కార్యక్రమం ఒకరం అని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నగరపాటి నాగేశ్వర రాజు అన్నారు. మంగళవారం మండలంలోని సురేంద్ర నగరం, ఓపెన పుత్రం గ్రామాలలో ఏపీ హేమాత అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ హేమ కుమార్, సర్పంచ్ పెరియస్వామి రెడ్డి, టిడిపి నాయకులు సోమశేఖర్ యాదవ్, శ్రీనివాసులు నాయుడు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

శాంతిపురం: మండలంలోని 30సొన్నే గానిపల్లి ఆర్‌బీకే పరిధిలోని గుండి శెట్టిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారి జి.అప్పోజి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్ప మంజునాథ్, టీడీపీ నాయకులు ఆనందు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని కీళ్లపట్ల పంచాయతీలో మంగళవారం ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పరంగా రైతులకు అంద జేస్తున్న సబ్సిడీ పథకాలు, పనిముట్లను సద్విని యోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఏ శివకు మార్, స్థానిక పశువైద్యాధికారి రెడ్డి ప్రియాంక, ఎం పీడీవో మధుసూదన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: రైతు సేవ కేంద్రాల్లో డ్రిప్ పరికరాలకు రిజిస్ట్రేషన్ చేస్తున్నామని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పుంగనూరు వ్యవసాయ సంచాలకులు శివకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలో చలమంగలం, లింగాపురం రైతు సేవ కేంద్రం పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రుద్రమ్మనాగ నాయుడు, అధికారులు, రవీంద్ర, అనిల్ కుమార్, మొహసీన, రెహ్మాన్, రైతులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని వ్యవసాయ అధికారి చిట్టిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని తుంబ, ఈచమేరిపాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతు సేవ కేంద్రం సిబ్బంది యుగంధర్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో అధికారులు అంబికా గాంధీ, రామమూర్తి, శేఖర్, సాధరయ్య, సిబ్బంది హేమంత్, బ్లేస్సి, రైతులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

సిపిఎం పార్టీ నాయకులు బంగారు మురళి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: తమకు ప్రాణహాని ఉందని సిపిఎం పార్టీ నాయకులు బంగారు మురళి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లి పంచాయితీ కొత్తపల్లి గ్రామంలో ఉంటున్న మహేంద్ర, పురందర, రెడ్డెప్ప, రామమూర్తిల నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. గత వారం పోలీసులు కొత్తపల్లి మహేంద్ర ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారని, ఆ సమాచారం తానే పోలీసులకు ఇచ్చినట్లు తనపై ఘర్షణకు వస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని, వారి వల్ల ప్రాణహాని ఉందని, తనను తన కుటుంబ సభ్యులకు ప్రాణరక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు.

కట్టమంచి చెరువు సుందరీకరణకు చర్యలు



చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కట్టమంచి చెరువు సుందరీకరణకు తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చర్చించారు. మంగళవారం కట్టమంచి చెరువు, కట్ట ప్రాంతాలను పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ వైపు బలహీనంగా ఉన్న కట్ట ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి, చెరువులు సుందరీకరణ చేయడంపై చర్చించారు. చెరువులో పూడికతీత పనులు చేపట్టడం, కట్టను బలోపేతం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. చెరువు సుందరీకరణ పనులపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. నగరంలోని ముఖ్యమైన ప్రాంతాలు, భవనాలు అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, ఇరిగేషన్ ఎస్ఈ విజయకుమార్ రెడ్డి, కమిషనర్ నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పురాతన భవనాల మరమ్మతులకు శ్రీకారం

చిత్తూరు సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా అడుగులేస్తున్నామని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పురాతన భవనాలైన పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన నిర్మాణాలు, చెరువులు, కాలువల మరమ్మతులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగస్వాములు కాదలిచిన దాతల నుంచి విరాళాలను సేకరిస్తున్నట్లు వివరించారు. దాతలు అందించే విరాళాలను కలెక్టరేట్లో కలెక్టర్ సంయుక్త ఆధ్వర్యంలో తెరిచిన బ్యాంకు ఖాతాలో జమ చేసి ఆ తరువాత ఆ సొమ్ముతో మరమ్మతులు చేపడతామన్నారు. టిడిపి సీనియర్ నాయకులు చంద్రప్రకాష్ తన వంతు సాయంగా రూ.ఐదు లక్షల చెక్కును కలెక్టర్‌కు అందించారు.

నరసింహ ప్రసాద్‌కు ఉత్తమ నాటక కళా సేవ అవార్డు



నరసింహ ప్రసాద్‌ను సత్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ద్రావిడ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బందిగా పనిచేస్తున్న డాక్టర్ నరసింహ ప్రసాద్ నాటక రంగంలో అందించిన సేవలను గుర్తించి కర్ణాటక నాటక అకాడమీ, కర్ణాటక ప్రభుత్వం వారు ఉత్తమ కళా సేవ అవార్డును అందించినట్టు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. ఈ అవార్డును కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చేతుల మీదుగా అందజేశారు. అవార్డు గ్రహీతను విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ వైస్ ఛాన్సులర్ ఛాంబర్‌లో ఘనంగా సత్కరించారు.

క్రైం కార్నర్

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

- రూ.8లక్షల విలువ చేసే ఆభరణాలు స్వాధీనం



దొంగను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పట్టణంలో దొంగతనానికి పాల్పడిన తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాతానికి చెందిన మహమ్మద్ బిలాల్‌ను చిత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరి సమావేశంలో డిఎస్పీ సాయినాథ్ వివరాలను వెల్లడించారు. ఇటీవల చిత్తూరు పట్టణంలో, చిత్తూరు-1 టౌన్, చిత్తూర్-2 టౌన్ పరిధిలో ఐదు చోట్ల తాళం వేసివున్న ఇంటి తలుపులు పగలగొట్టి బంగారు నగలు దొంగలించిన సంఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. సీఐలు జయరామయ్య, నెట్టికంటయ్యలు తమ సిబ్బందితో కలిసి బృందాలుగా విడిపోయి కేసు దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. గుడియాత్తంకు చెందిన మహమ్మద్ బిలాల్ మంగళవారం కాట్పాడి వద్ద అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి సుమారు రూ.8 లక్షల విలువైన 130గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అవమానం భరించలేక ఆత్మహత్య

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అక్రమ సంబంధం అంటగట్టిన అవమానాన్ని భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండలంలోని పాలేరు గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప కథనం మేరకు.. పాలేరు గ్రామం చెందిన చలపతి (40) గ్రామంలో ఇతనిపై అక్రమ సంబంధాన్ని అంటగట్టారు. ఆ అవమానాన్ని భరించలేక తన ఇంటిలోని ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెందాడు. శవ పరీక్ష నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటు సారా స్వాధీనం

- ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 9లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. అందిన సమాచారం మేరకు మండలంలోని చిల్లమాకులపల్లి పంచాయతీ పొదలపల్లి గ్రామంలో సోదాలు చేపట్టామన్నారు. అదే గ్రామానికి చెందిన చిరంజీవి(48) 10లీటర్ల సారా విక్రయించేందుకు సిద్ధంగా ఉంచినట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 9లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

భూ మాయగాడు అరెస్ట్

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన రెవెన్యూ లెక్క దాఖలాల్లో నకిలీ, ఫోర్జరీ పత్రాలతో పాకాల సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో గంటావారిపల్లెలోని పుల్లారెడ్డి కుమారుడు జయచంద్రారెడ్డి(28)ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు అతన్ని రిమాండ్‌కు తరలించామని వెదురుకుప్పం ఎస్ఐ వెంకట సుబ్బయ్య మంగళవారం మీడియాకు తెలిపారు.

బంగారుపాళ్యం డీటీగా కళ్యాణి



కళ్యాణి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బంగారుపాళ్యం డిప్యూటీ తహశీల్దార్‌గా కళ్యాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో గుడిపాల మండలంలో పనిచేస్తూ బదిలీపై వచ్చారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



నూతన బోర్‌వెల్ వద్ద మాజీ ఏఎంసి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని మిట్టూరు గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న మాజీ ఏఎంసీ ఛైర్మన్ చంద్రశేఖర్ చొరవ తీసుకొని దగ్గరుండి మంగళవారం నూతన బోరును ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామానికి నీటి సమస్య తీరింది. ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, దేవేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లెపల్లి పంచాయితీ ఆర్‌బీకేలో రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న ఉలవలను మంగళవారం అధికారులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ చేతుల మీదుగా ఉలవలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుష్పరాజ్, దేవరాజుల నాయుడు, మాజీ ఉపసర్పంచ్ వెంకటపతి రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్ యాదవ్, అగ్రికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ కవిత తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం



హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న బాబు నాయుడు

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని కుప్పిగాని పల్లిలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని మంగళవారం టీడీపీ గుడిపల్లి మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ ఆసుపత్రి అందుబాటులోకి రావడం సంతోషకరం అన్నారు. ప్రజలందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ చంద్ర, సుబ్రమణి, సర్పంచ్ రామ్మూర్తి, రామచంద్రుడు, వైద్య సిబ్బంది వెంకటేశ్వర రావు, సూపర్వైజర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని అగరం పంచాయతీలో సర్పంచ్ లావణ్యగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, డ్రైనేజీలను పరిశుభ్రం చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

క్రీడా రత్నాలు.. కొత్తిండ్ల విద్యార్థులు

ప్రజాశక్తి-కుప్పం రూరల్: చందం పంచాయతీ కొత్తిండ్లు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడా రత్నాలుగా ఎదుగుతున్నారని ప్రధానోపాధ్యాయులు మార్కొండ నాయుడు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచినట్టు తెలిపారు. యోగాలో అండర్-17 బాలికల విభాగంలో ఝాన్సీ రాణి, రంజిత, హారతి, షాట్ పుట్‌లో కార్తిక్, డిస్కస్ త్రోనందు జయప్రియ, 600మీటర్ల పరుగు పందెంలో హారతి, 400 మీటర్ల పరుగు పందెంలో శకుంతల విజయం సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథం, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు గ్రామస్తులు అభినందించారు.

జోరుగా మండల స్థాయి క్రీడలు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని జంబాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలు జోరుగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పన్నూరు, జంబాడ, విజయపురం, శ్రీహరిపురం, గంగమాంబపురం పాఠశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, యోగా, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఇందులో బాలురు, బాలికలు పాల్గొని తమ సత్తా చూపించారు. సుమారు 250మంది క్రీడలు పాల్గొనగా అందులో 120మంది ఎంపికయ్యారు. వీరు బుధవారం పుత్తూరు ఎస్ఆర్ఎస్ కళాశాలలో జరుగు నియోజకవర్గ స్థాయి క్రీడ పోటీలో పాల్గొంటారని పీఈటీ గురప్ప తెలిపారు.

'నాయీ బ్రాహ్మణులే సెలూన్లు నిర్వహించాలి'



కమిషనర్‌కి వినతి పత్రం అందిస్తున్న నాయీ బ్రాహ్మణులు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్ష కార్యదర్శ సభ్యుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ పనిని ఇతర కులాల వారు నిర్వహించవద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతి పత్రం అందించారు. అనంతరం నాయి బ్రాహ్మణ సంఘం పలమనేరు అధ్యక్షుడు నరేంద్ర మాట్లాడుతూ తాము పుట్టినప్పుడు నుంచి ఇప్పటివరకు కూడా ఇదే వృత్తిలో కొనసాగుతున్నామని, బయట ప్రాంత వ్యక్తులు తమ అనుమతి లేకుండా ఇక్కడ షాపులు నిర్వహిస్తున్నారన్నారు. దానివల్ల తామంతా ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. దీనిపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మంచిని తలచాం.. అభివృద్ధే చేస్తాం..

- 'ఇది మంచి ప్రభుత్వం'లో ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: ప్రభుత్వ అధికారులు ఎవరైనా సక్రమంగా పని చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేసినట్లు తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఐరాల మండలంలోని నాంపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఏర్పాటు చేసిన సభలో ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు వివరించారు.

గంగాధర నెల్లూరు: రాష్ట్రంలో అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం పథకాలను సీఎం చంద్రబాబు పాలన సాగిస్తూ ముందుకు వెళ్తున్నారని నియోజకవర్గ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నియాజ్‌అలి అన్నారు. మంగళవారం మండలంలోని తూగుండ్రం పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, ఫిరోజ్ అలీ, సంపత్, పంచాయతీ సెక్రటరీ మురళి పాల్గొన్నారు.

సదుం: కూటమి ప్రభుత్వం పరిపాలన చేపట్టిన వంద రోజుల్లోనే సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అందుతున్నాయని కూటమి నాయకులు అన్నారు. "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమాన్ని మంగళవారం అమ్మగారిపల్లి పంచాయతీలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవ, దొరబాబు, నాగేంద్ర, పవన్, బాలు, సుబ్రహ్మణ్యం, లోకేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: ఏడు పదులు దాటిన వయసులో విజయవాడలో సంభవించిన వరదల్లో ఏడు రోజులపాటు బస్సులో ఉంటూ అందరికీ నమ్మకం కల్పించిన సీఎం చంద్రబాబుని ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి వైపు అడుగులు వేయాలని నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుమార్ అన్నారు. మంగళవారం ముద్దికుప్పం పంచాయతీ కార్యాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమం స్థానిక సర్పంచ్ గిరి సీనయ్య ఆధ్వర్యంలో స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డి నిర్వహించారు.

గుడిపల్లి: మండలంలోని దాసమానపల్లి, పొగురుపల్లి, కుప్పిగానిపల్లి పంచాయతీల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బాబు నాయుడు పాల్గొన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు గోపాల్, రామ్మూర్తి, నాయకులు సుబ్రమణి, భాను, చంద్ర, గోవిందస్వామి, అధికారులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంకు వంద రోజుల్లో మంచి జరిగిందని సీఎం చంద్రబాబుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని టిడిపి నాయకులు ప్రకాష్, దయనిది అన్నారు. మంగళవారం కార్వేటినగరంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది కల్పన, గ్రామస్తులు కృష్ణమనాయుడు, తగిజాలు పాల్గొన్నారు.

కుప్పం టౌన్: కుప్పం పట్టణ పరిధిలోని కొత్తపేట 14, 15 వార్డులలో పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, నియోజకవర్గ టిడిపి పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ తదితరులు హాజరయ్యారు.

పెద్దపంజాణి: మంచి ప్రభుత్వాలు రాష్ట్రాల్లో పరిపాలిస్తేనే ప్రజలకు రాష్ట్ర అభివృద్ధికి కారణం అవుతాయని టీడీపీ నాయకులు భాను ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాజుపల్లి పంచాయతీ పరిధిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, చందుయాదవ్, నాగరాజు, సుబ్రహ్మణ్యం, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలి'



కుప్పంలో

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాఠి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పివిఆర్ ప్రభుత్వ కళాశాలలో జాతీయ ఎన్ఎస్ఎస్ దినోత్సవ కార్యక్రమం కోఆర్డినేటర్ మురళి ఆధ్వర్యంలో జరిగింది. వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం హసీనా, శ్రీనివాసులు, చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక మదర్ థెరిసా కళాశాలలో మంగళవారం జాతీయ సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలమనేరు హోమియోపతి వైద్యురాలు గౌరిశ్రీ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటరీలు మొక్కలు నాటి పరిసరాల పరిశుభ్రత పాటించి మానవ ఆరోగ్యం పెరుగుదలకు తోడ్పడడానికి తమ వంతు ప్రయత్నించాలని, సేవా కార్యక్రమంలో పాల్గొని ప్రజలను చైతన్యపరిచి వారికి అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వైద్యులు మోహనకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్ దేవేందర్ రెడ్డి, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయ ఎన్‌సిసికి సంబంధించిన 35మంది విద్యార్థులకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి సర్టిఫికెట్లను జారీ చేశారు. అదేవిధంగా 2024-25వ సంవత్సరానికి 60మంది ఎన్‌సిసి నూతన విద్యార్థులను నమోదు చేయడం జరిగింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కిరణ్ కుమార్, 35 బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, చిత్తూరు కేర్ టేకింగ్ ఆఫీసర్ శ్రీప్రియ పాల్గొన్నారు.

కార్వేటినగరం: ప్రతి ఒక్కరు విద్యార్థి దశనుండే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆర్‌కేఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కృష్ణ కిషోర్ తెలిపారు. స్థానిక ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.స్వరూప ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ సేవా పథకం దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు రాజేష్ కుమార్, రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: విద్యార్థి దశ నుండే యువత సమాజంలో సేవా భావాన్ని పెంపొందించుకోవాలని తద్వారా ప్రజలకు సేవ చేసి తమ సేవా నిరతిని చాటుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు కోరారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సేవా భావాన్ని పెంపొందించుకోవడం ఎలా అన్న అంశంపై అవగాహన కల్పించి వారిచేత కళాశాల ఆవరణంలో మొక్కలు నాటించి ప్రతిజ్ఞ చేయించారు.

కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గం పరిధిలోని వివిధ సంస్థలలో గల ఎన్ఎస్ఎస్ అధికారులు, సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యక్షులు ఆచార్య ఎం.దొరస్వామి, రిజిస్ట్రారు ఆచార్య కిరణ్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని చెట్లు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జింక లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ బృందం కళాశాల పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా బిసిఎన్ విద్యాసంస్థలలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమాజ సేవలో ఎన్ఎస్ఎస్‌తో పాటు విద్యార్థులు ప్రతి ఒక్కరు ముందుండాలని సూచిస్తూ, పలు కార్యక్రమాలను నిర్వహించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గంగవరం: మండల కేంద్రంలోని పద్మావతి బాలికల కళాశాల ప్రాంగణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. కుప్పం, మెడికల్ కళాశాల, చిత్తూరు మెడికల్ అసోసియేషన్ వారు సహకారం అందించారు. శిబిరంలో 510మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 25మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరికి గురువారం ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. మిగతా 75మందిని ఇతర వైద్య ఆరోగ్య పరీక్షలు ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జయశంకర్, కార్యదర్శి రవి, సభ్యులు, ట్రస్ట్ ఛైర్మన్ చంద్రయ్య శెట్టి, మాజీ ఛైర్మన్ సత్య నారాయణ శెట్టి, దివాకర్, శ్రీరాములు శెట్టి, రాజప్ప శెట్టి, సత్య ప్రకాష్, గుణశేఖర్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన



గర్భిణీలకు సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనత్తం అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా మంగళవారం గర్భిణీలకు సీమంతం సీడీపీవో మాధవి లత ఆధ్వర్యంలో సీమంతం నిర్వహించారు. పౌష్టికాహార ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీనివాస్ గౌడ్‌కి నివాళి



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న నాయకులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లికి చెందిన శ్రీనివాస్ గౌడ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, సర్పంచ్ కొమ్ము వెంకటేష్‌లు మంగళవారం శ్రీనివాస్ గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారితో పాటు కోఆప్షన్ సభ్యులు ఫైజుల్లా, యువ నాయకులు రాజు, మండల్ యూత్ ప్రెసిడెంట్ మహేష్, షాకీర్, పీరు, ముఖ్య నాయకులు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి వీలుగా ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 26న నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు వారి సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమానికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.